క్లుప్తంగా

'పది' పరీక్ష కేంద్రాల్లో లోటుపాట్లు ఉండొద్దు



మునగాలలో పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసి వస్తున్న డీఈఓ, అధికారులు

మునగాల: పదో తరగతి పరీక్ష కేంద్రాల్లో ఎలాంటి లోటుపాట్లు ఉండొద్దని డీఈఓ అశోక్ అన్నారు. శుక్రవారం ఆయన మునగాల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, న్యూప్రజ్ఞ హైస్కూల్‌లో పదో తరగతి పరీక్ష కేంద్రాలను ఆకస్మిక తనిఖీ చేశారు. సిబ్బందిని అడిగి పలు వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయన్నారు. ఆయన వెంట మండల విద్యాధికారి పిడతల వెంకటేశ్వర్లు, తహసీల్దార్ వి.ఆంజనేయులు, ఎంపీడీఓ కె.రమేష్‌దీనదయాళ్ తదితరులు ఉన్నారు.

అగ్నివీర్‌కు ఎంపిక



నరేష్

నడిగూడెం : ఆర్మీ నియామకాల్లో భాగంగా అగ్నివీర్‌కు నడిగూడెం మండలంలోని కరివిరాల కు చెందిన కురిపాటి రాములు, ఉప్పమ్మ దంపతుల కు మారుడు నరేష్ ప్రతిభ కనబరిచాడు. జనరల్ కేటగిరిలో అగ్నివీర్ ఉద్యోగానికి ఎంపికైనట్లు శుక్రవారం నరేష్ స్థానికంగా తెలిపారు. ఈ సందర్భంగా నరేష్‌ను గ్రామపెద్దలు, కుటుంబసభ్యులు అభినందించారు.

ఎలక్ట్రిక్ వీల్ చైర్ బహూకరణ



శంభిరెడ్డికి ఎలక్ట్రిక్ వీల్ చైర్ అందజేస్తున్న సాగర్ సిమెంట్ పరిశ్రమ అధికారులు

మఠంపల్లి : మండలంలోని పెదవీడుకు చెందిన దివ్యాంగుడు వర్రా శంభిరెడ్డికి శుక్రవారం స్థానిక సాగర్ సిమెంట్ పరిశ్రమ యాజమాన్యం తరఫున రూ.50 వేల విలువ గల ఎలక్ట్రిక్ వీల్ చైర్‌ను పరిశ్రమ అధికారులు అందజేశారు. కార్యక్రమంలో పరిశ్రమ వీపీ రమణమూర్తి, డీజీఎం హేమంత్‌కుమార్, అధికారులు తూడి వెంకటరెడ్డి, వల్లపుదాస్ కొండలుగౌడ్ తదితరులు ఉన్నారు.

అందుబాటులో పశుగ్రాస విత్తనాలు

కోదాడరూరల్ : కోదాడ పశువైద్యశాలలో 2750 కేజీల పశుగ్రాస విత్తనాలు సబ్సిడీపై అందజేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు ప్రాంతీయ పశువైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ పెంటయ్య తెలిపారు. శుక్రవారం స్థానికంగా పశుగ్రాస విత్తనాల స్టాక్‌ను పరిశీలించి మాట్లాడారు. కేజీ విత్తనాల ధర రూ.98.89 కాగ 75 శాతం సబ్సిడీపై రూ.24.70కు ఇవ్వనున్నట్లు తెలిపారు. విత్తనాలు కావాల్సిన కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాలకు చెందిన రైతులు స్థానిక పశువైద్యశాలలో సంప్రదించాలని ఆయన కోరారు.


జూదం ఆడితే చర్యలు

కోదాడరూరల్ : జూదం ఆడుతూ పట్టుబడితే చట్టరీత్య చర్యలు తప్పవని కోదాడ పట్టణ సీఐ కె.శివశంకర్ హెచ్చరించారు. గతంలో జూదం ఆడుతూ పట్టుబడిన పలువురిని శుక్రవారం కోదాడ పట్టణ స్టేషన్‌లో బైండోవర్ చేసి మాట్లాడారు. జూదం ఆడుతున్నట్లు ఎవరికైన తెలిస్తే తమకు సమాచారం ఇవ్వాలని, ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. ఆయన వెంట ఎస్ఐ సైదులు, సిబ్బంది ఉన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం

నడిగూడెం : మండలంలోని చెన్నకేశ్వాపురంలో జాతీయ ఉపాధి హామీ పథకం నిధులు రూ. 5 లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను శుక్రవారం స్థానిక నాయకులు ప్రారంభించారు. కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు కటికల పుల్లయ్య, నాయకులు గుజ్జర్లపూడి అర్జునరావు, తుమ్మల సుబ్బారావు, అంజి పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి



ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

గరిడేపల్లి : యువత మాదకద్రావ్యాలకు దూరంగా ఉండాలని ఎన్ఎస్ఎస్ యూనిట్-1ప్రోగ్రాం ఆఫీసర్ బి. నాగార్జున అన్నారు. హుజూర్‌నగర్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం -1 స్పెషల్ క్యాంపులో భాగంగా ఆరవ రోజు శుక్రవారం మండలంలోని రాయినిగూడెం గ్రామంలో మాదకద్రవ్యాలతో కలిగే అనార్థాలపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థి మేలుకో మాదక ద్రవ్యాల వినియోగం మానుకో, మద్యపానం మానుకో ఆరోగ్యాన్ని కాపాడుకో అనే నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్లు.. ప్రమాదాలకు నిలయాలు

మఠంపల్లి,నేరేడుచర్ల : మఠంపల్లి మండలంలోని మట్టపల్లి నుంచి హుజూర్‌నగర్‌కు వెళ్లే ప్రధాన రహదారిపై ఎర్రగట్టు, బక్కమంతులగూడెం క్రాస్ రోడ్డు, త్రివేణినగర్, చౌటపల్లి, మఠంపల్లి, పెదవీడు తదితర గ్రామాల పరిధిలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా ఉన్నాయి. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ రక్షణ కంచె ఏర్పాటు చేయలేదు. మట్టపల్లి- హుజూర్‌నగర్ రహదారిపై ఏపీ నుంచి తెలంగాణకు వాహనాల రాకపోకలతో నిత్యం రద్దీగా ఉంటుంది. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పెదవీడు సమీపంలో ఇటీవల రాత్రి వేళ ఓ బైక్ అదుపు తప్పి రోడ్డు వెంట ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు తగలడంతో వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. విద్యుదాఘాతంతో జీవాలు కూడా మృతి చెందుతున్నాయి. అదేవిధంగా నేరేడుచర్ల పట్టణంలోని 15వ వార్డులో అంజలి స్కూల్ ఎదురుగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ తక్కువ ఎత్తులో ఉంది. వైర్లు కూడా కిందకు వేలాడుతున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ రక్షణ కంచె ఏర్పాటు చేయాలని, ప్రమాద సూచికలు పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.



మఠంపల్లి : చౌటపల్లిలో రోడ్డు వెంట ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్



మఠంపల్లి : ఎర్రగట్టు వద్ద..



నేరేడుచర్ల : 15వ వార్డులో..

వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ నిరసన



కోదాడలో పెద్ద మజీద్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ముస్లింలు

కోదాడ: కేంద్ర ప్రభుత్వం తెచ్చిన వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ శుక్రవారం కోదాడ పట్టణంలో ముస్లింలు నిరసన కార్యక్రమం చేపట్టారు. పలువురు ముస్లింలు నల్లబ్యాడ్జీలు ధరించి కోదాడ పెద్ద మజీద్ వద్ద రహదారిపై ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ముస్లింలు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ముస్లిలపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందన్నారు. లౌకికవాదులు దీన్ని ఖండించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్‌కె.నయీమ్, మహిమూద్, మజహార్, మహమ్మద్, మునీర్, అలీబాయ్, అబ్బు, ఆసీఫ్, అల్తాఫ్, జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

నేరేడుచర్లలో..

నేరేడుచర్ల : వక్ఫ్‌బోర్డు చట్ట సవరణ బిల్లుకు వ్యతిరేకంగా శుక్రవారం నేరేడుచర్లలోని జాన్‌పహాడ్ రోడ్డులో గల మసీదు వద్ద ముస్లింలు నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మసీద్ ముఫ్తీ షోయబ్ ఆలం, సదర్ ఇబ్రహీం, ఖాదర్‌ఖాన్, ఖాదర్ పాష, ఖలీమ్, ఖాజా, హఫీజ్ గౌస్, హనీఫ్, ఖదీర్, యాకుబ్, నజీర్, ఇస్తియాక్, జానీ ఉన్నారు.

నడిగూడెంలో..

నడిగూడెం : వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లుకు వ్యతిరేకంగా ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు పిలుపుమేరకు శుక్రవారం స్థానిక మక్కా మసీదు వద్ద ముస్లింలు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మక్కా మసీద్ సదర్ ఎస్‌కె.రియాజ్, జానిమియా, నజీర్, సుభాని, పాషా, అక్రమ్, జావీద్, తదితరులు పాల్గొన్నారు.

పేదల కడుపు నింపడమే ప్రభుత్వ లక్ష్యం

- కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి

నేరేడుచర్ల : సన్న బియ్యం ఇచ్చి పేదల కడుపు నింపడమే ప్రభుత్వ లక్ష్యమని కోదాడ ఎమ్మెల్యే నలమాద పద్మావతి అన్నారు. శుక్రవారం రాత్రి నేరేడుచర్ల మున్సిపాలిటీలోని ఏ-1 ఫంక్షన్ హాల్‌లో రంజాన్ పర్వదినం సందర్భంగా ప్రభుత్వం తరఫున నేరేడుచర్ల, పాలకీడు, గరిడేపల్లి మండలాల ముస్లింలకు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆమె పాల్గొని మాట్లాడారు. హుజూర్‌నగర్‌లో 30వ తేదీన సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా సన్న బియ్యం పథకం ప్రారంభించనున్నట్లు తెలిపారు. హుజూర్‌నగర్ నియోజకవర్గంలో ఇళ్లు లేని నిరుపేదలకు ప్రభుత్వం 3500 ఇళ్లు కేటాయించినట్లు తెలిపారు. నేరేడుచర్లలో షాదీఖానా నిర్మాణానికి సరైన స్థలం ఎంపిక చేసేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్లు సైదులు, బండ కవిత, కమలాకర్, కమిషనర్ అశోక్‌రెడ్డి, ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొణతం చిన వెంకట్‌రెడ్డి, నారపరాజు సుబ్బారావు, రామారావు, సందీప్‌రెడ్డి, సత్యనారాయణ, సురేష్‌రెడ్డి, బచ్చలకూరి ప్రకాశ్, గోపాల్, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు ఉన్నారు.



నేరేడుచర్లలో ఇఫ్తార్ విందులో పాల్గొని మాట్లాడుతున్న ఎమ్మెల్యే పద్మావతి



కోదాడ : క్యాన్సర్ నిర్ధారణ శిబిరంలో మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పద్మావతి

హిందూముస్లింల ఐక్యతకు ప్రతీక రంజాన్

కోదాడ : హిందూముస్లింల ఐక్యతకు ప్రతీక రంజాన్ అని కోదాడ ఎమ్మెల్యే నలమాద పద్మావతిరెడ్డి అన్నారు. శుక్రవారం కోదాడలోని డేగ బాబు ఫంక్షన్ హాల్‌లో ప్రభుత్వం తరఫున ముస్లిలంకు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆమె పాల్గొని మాట్లాడారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వంగవేటి రామారావు, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ వైస్ చైర్మన్ జబ్బార్, కోదాడ మార్కెట్ వైస్ చైర్మన్ బషీర్, తహసీల్దార్ వాజీద్, నాయకులు చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డి, సామినేని ప్రమీల, కందుల కోటేశ్వరరావు, అల్తాఫ్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ నిర్ధారణ శిబిరం ఏర్పాటు అభినందనీయం : ఎమ్మెల్యే

కోదాడ : కోదాడలో బసవతారకం క్యాన్సర్ వైద్యశాల వారు ఉచిత క్యాన్సర్ నిర్ధారణ శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమని కోదాడ ఎమ్మెల్యే నలమాద పద్మావతిరెడ్డి అన్నారు. శుక్రవారం కోదాడ ప్రభుత్వ వైద్యశాలలో జిల్లా వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో బసవతారకం క్యాన్సర్ వైద్యశాల వారు ఏర్పాటు చేసిన ఉచిత క్యాన్సర్ నిర్ధారణ శిబిరాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా శిబిరంలో అందుతున్న వైద్య సేవల గురించి మహిళలతో మాట్లాడి తెలుసుకున్నారు. కాగా, శిబిరానికి మహిళలు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి కోటాచలం, డిప్యూటీ డీఎంహెచ్ఓ జయమనోరి, వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ దశరథనాయక్, నాయకులు చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డి, సామినేని ప్రమీల, బసవతారకం వైద్యశాల జనరల్ మేనేజర్ ఆదిత్య, తదితరులు పాల్గొన్నారు.

కోటను సందర్శించి.. చరిత్ర తెలుసుకొని



రాజావారి కోటలో గురుకుల పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు

నడిగూడెం : మండల కేంద్రంలోని 120 ఏళ్ల నాటి రాజావారి కోటను శుక్రవారం సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థులు క్షేత్ర పర్యటనలో భాగంగా సందర్శించారు. కోటలోని నాటి భవనాలు, గ్రంథాలయం, 108 అడుగుల జాతీయ జెండా నమూనా తదితర వాటిని సందర్శించి చరిత్ర తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రాజానాయిని వెంకటరంగారావు, పింగళి వెంకయ్య, కొమర్రాజు లక్ష్మణరావు తదితరుల చరిత్రను డాక్రి సంస్థ నిర్వాహకులు జితిన్‌బాబు విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చింతలపాటి వాణి, వైస్ ప్రిన్సిపాల్ ఏ.వెంకటేశ్వర్లు, సునీత, ఎస్.ఎన్.మూర్తి ఉన్నారు.

అనాథ విద్యార్థులకు వస్త్రాల పంపిణీ

కోదాడ : రంజాన్ పండుగను పురస్కరించుకొని కోదాడ బాలుర ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ముస్లిం అనాథ విద్యార్థులకు జమాతే ఇస్లామీ హింద్ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ సలీంషరీఫ్, మార్కెండేయులు, బడుగుల సైదులు, జానిమియా తదితరులు పాల్గొన్నారు.



వస్త్రాలు అందజేస్తున్న ఎంఈఓ సలీంషరీఫ్

రిటైర్డు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



పుట్టినరోజు జరుపుకున్న పెన్షనర్లను సన్మానించిన రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు

హుజూర్‌నగర్ : ప్రభుత్వం రిటైర్డు ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వ పెన్షనర్ల సంఘం నాయకులు కోరారు. శుక్రవారం హుజూర్‌నగర్‌లోని పెన్షనర్ల కార్యాలయంలో పెన్షనర్ల సామూహిక జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మార్చి నెలలో జన్మించిన వారిని, ఇటీవల రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన క్రీడలు, సాంస్కృతిక పోటీల విజేతలను శాలువాలతో సత్కరించారు. అదే విధంగా కార్యాలయంలో ఇన్వర్టర్‌కు రూ.22 వేలు సహకారమందించిన పెన్షనర్ రాధాదుర్గ, మూర్తి దంపతులను, ఈనెల భోజన వసతి కల్పించిన విజయమేరీని సన్మానించారు. సమావేశంలో పెన్షనర్ల సంఘం నాయకులు చెన్న సోమయ్య, పూర్ణచంద్రారెడ్డి, కొప్పుల వీరారెడ్డి, చంద్రశేఖర్, కేపీఎస్ మూర్తి, దేవదానం, నారపరాజు వెంకటేశ్వరరావు, ప్రభాకర్‌రెడ్డి, ధర్మూరి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందు ఏర్పాటు పుణ్యకార్యం



కోదాడరూరల్ : ఇఫ్తార్ విందును ప్రారంభిస్తున్న ఏర్నేని కుసుమ వెంకటరత్నంబాబు

కోదాడరూరల్ : రంజాన్ మాసం సందర్భంగా ఉపవాస దీక్షలో ఉన్నవారికి ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయడం పుణ్యకార్యమని కోదాడ మాజీ సర్పంచ్ ఎర్నేని వెంకటరత్నంబాబు అన్నారు. శుక్రవారం కోదాడ పట్టణంలోని ఎంఎస్ కళాశాల ఎదురుగా 26వ వార్డు మైనార్టీ నాయకుడు ఎస్‌కె.ఖాజామొయినుద్దీన్ ఏర్పాటు చేసిన ఇఫ్తార్‌విందును ఆయన ప్రారంభించి మాట్లాడారు. నెమ్మాది దేవమణిప్రకాష్‌బాబు, పంది తిరపయ్య, భాస్కర్‌రావు, లైటింగ్ ప్రసాద్, కలకొండ వెంకటేశ్వర్లు, వేమూరి విద్యాసాగర్, జమేష్, అబ్దుల్, లక్ష్మణ్ ఉన్నారు.

మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్‌విందు

మునగాల : మత సామరస్యానికి ఇఫ్తార్‌విందు ప్రతీక అని యూత్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తక్కెళ్లపాటి సాయి అన్నారు. శుక్రవారం రాత్రి మండలంలోని బరాఖత్‌గూడెంలో యూత్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు నాగుల్‌పాషా.. ముస్లింలకు ఇచ్చిన ఇఫ్తార్‌విందు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ బ్లాక్, మండల శాఖ అధ్యక్షుడు కొలిశెట్టి బుచ్చిపాపయ్య, కొప్పుల జైపాల్‌రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు నల్లపాటి శ్రీనివాస్, ఎలక నరేందర్‌రెడ్డి, కాలే సామియేలు, ఒరుగంటి రవి కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో..

చిలుకూరు : మండలంలోని బేతవోలులో శుక్రవారం ముస్లింలకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సహకార సంఘం చైర్మన్ బజ్జూరి రవీందర్‌రెడ్డి, నాయకులు వనపర్తి రామారావు, బిట్టు అజయ్, రెమిడాల ఆనందరావు, బెజవాడ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చిలుకూరులో..

చిలుకూరు మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకుడు, మాజీ ఎంపీపీ దొడ్డా సురేష్ ముస్లింలకు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందును చిలుకూరు సహకార సంఘం చైర్మన్ అలసకాని జనార్దన్ ప్రారంభించారు. పలువురు నాయకులు, ముస్లింలు పాల్గొన్నారు.

సహకార సంఘం అభివృద్ధికి కృషి



నడిగూడెం : రత్నవరంలో మాట్లాడుతున్న పీఏసీఎస్ చైర్మన్ రామారావు



హుజూర్‌నగర్ : సమావేశంలో మాట్లాడుతున్న పీఏసీఎస్ చైర్మన్ నరేందర్

నడిగూడెం : పాలకవర్గం, రైతుల సహకారంతో సంఘం అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు నడిగూడెం పీఏసీఎస్ చైర్మన్ కొల్లు రామారావు అన్నారు. శుక్రవారం మండలంలోని రత్నవరం రైతు వేదికలో నిర్వహించిన సర్వ సభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఆరు నెలలుగా సంఘంలో జరిగిన లావాదేవీలను వివరించారు. ప్రస్తుత రబీ సీజన్ ధాన్యం కొనుగోలు చేసేందుకు నడిగూడెం, రత్నవరం గ్రామాలలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు జిల్లా అధికారులకు ప్రతిపాదనలు పంపినట్లు పేర్కొన్నారు. అనంతరం ఇటీవల కోదాడ మార్కెట్ చైర్ పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించిన వేపూరి తిరుపతమ్మను ఘనంగా సన్మానించారు. అనంతరం తిరుపతమ్మ మాట్లాడుతూ కోదాడ వ్యవసాయ మార్కెట్‌లో ప్రతి శని, ఆదివారాలలో నిర్వహిస్తున్న పశువుల సంతను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సీఈఓ కిరణ్ కుమార్‌రెడ్డి, వైస్ చైర్మన్ గుండెపూరి రాములు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బూతుకూరి వెంకటరెడ్డి, పాలకవర్గ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

గరిడేపల్లి : సహకార సంఘాలు అందజేస్తున్న దీర్ఘకాలిక, స్వల్పకాలిక రుణాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని చైర్మన్ గంటా సుధాకర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని గడ్డిపల్లి గ్రామంలో గల రైతు సేవా సహకార సంఘం కార్యాలయం వద్ద నిర్వహించిన మహాజన సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతులు సకాలంలో రుణాలు చెల్లించి సంఘం అభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ శానం వీరభద్రయ్య, మాజీ సర్పంచ్ సుందరి నాగేశ్వరరావు, డైరెక్టర్లు దొంగరి భద్రయ్య, బచ్చు కృష్ణయ్య, ఆకుల అరవిందు, కారింగుల రామయ్య, కోన జానకిరామయ్య, దాచేపల్లి నగేష్, ఆరెపూరి వెంకటేశ్వర్లు, సెక్రటరీ బచ్చు సైదయ్య, సిబ్బంది, సభ్యులు పాల్గొన్నారు.

సహకార సంఘం అభివృద్ధికి కృషిచేయాలి

హుజూర్‌నగర్ : సహకార సంఘం అభివృద్ధికి సభ్యులు కృషి చేయాలని పీఏసీఎస్ చైర్మన్ జక్కుల నరేందర్ అన్నారు. శుక్రవారం హుజూర్‌నగర్‌లోని పీఏసీఎస్ కార్యాలయంలో సంఘం వార్షిక సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గత సంవత్సర కాలంలో జరిగిన సంఘం ఆదాయ వ్యయాలను చదివి వినిపించారు. సమావేశంలో వైస్ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, డైరెక్టర్లు లక్ష్మీ, మల్లీశ్వరి, శ్రీను, మల్లమ్మ, బ్రహ్మం, శ్యామ్ సుందర్, లచ్చిరాం, సెక్రటరీ నరేందర్ రెడ్డి, రైతులు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

రైతుల సహకారంతో సంఘం అభివృద్ధి

చిలుకూరు : రైతుల సహకారంతో సంఘం అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు బేతవోలు సహకార సంఘం చైర్మన్ బజ్జూరి రవీందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం బేతవోలులో సహకార సంఘం ఆవరణలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు సకాలంలో ఎరువులు అందిస్తున్నామని, రుణ మాఫీ రూ.4.21 కోట్లు అయినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఈఓ సయ్యద్ పాషా, పాలకవర్గం సభ్యులు, పాల్గొన్నారు.

ఆస్క్ ఆధ్వర్యంలో పాలిటెక్నిక్ ఉచిత శిక్షణ



కరపత్రం ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

కోదాడ : పట్టణంలోని ఎంఎస్ కళాశాల ఆవరణలో అంబేద్కర్ ఆశయ సాధన కేంద్రం (ఆస్క్) ఆధ్వర్యంలో పాలిటెక్నిక్, టీఎస్ ఆర్‌జేసీల ఎంట్రెన్స్‌కు ఉచిత శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శుక్రవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో శిక్షణ కరపత్రాన్ని వారు ఆవిష్కరించి మాట్లాడారు. ఏప్రిల్ 5 నుంచి తరగతులు ప్రారంభమవుతాయని, ప్రతిరోజు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు తరగతులు ఉంటాయని తెలిపారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో పందిరి నాగిరెడ్డి, మాగి గురవయ్య, బల్గూరి స్నేహ, మాతంగి ప్రభాకర్, యలమర్తి శౌరి, గంధం బుచ్చారావు, పిడమర్తి వెంకటేశ్వర్లు, నందిపాటి సైదులు, కుడుముల స్వామిదాసు, వెంకటరత్నం, వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామనవమి ఏర్పాట్లపై సమీక్ష

నేరేడుచర్ల : పట్టణంలోని శ్రీసీతారాముల ఆలయంలో శ్రీరామనవమిని పురస్కరించుకొని నిర్వహించబోయే సీతారాముల కల్యాణ మహోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పట్టణ ప్రముఖులు కొణతం చిన వెంకట్‌రెడ్డి కోరారు. శ్రీరామనవమి వేడుక ఏర్పాట్లపై శుక్రవారం ఆలయ కమిటీ సభ్యులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో పులిజాల రమణారావు, నాగండ్ల శ్రీధర్, బాల వెంకటేశ్వర్లు, కొణతం ఆదిరెడ్డి, దూళిపాల ధనుంజయనాయుడు, చిత్తనూరు సత్యనారాయణ, తాటికొండ శ్రీనివాస్‌రెడ్డి, నటరాజ్, పుల్లయ్య, నగేష్, నీలా రామ్మూర్తి, శావయ్య, గోపాలకృష్ణ, మధు, వాసు, బలగం రాము తదితరులు ఉన్నారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

గరిడేపల్లి : మాస శివరాత్రి సందర్భంగా గరిడేపల్లి మండలంలోని కీతవారిగూడెం గ్రామంలో గల శ్రీపార్వతి సమేత రామలింగేశ్వరస్వామి దేవాలయంలో శుక్రవారం అర్చకులు రాయప్రోలు భద్రయ్యశర్మ, శ్రీరామయ్యశర్మ, ఉపేందర్ శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాత సేవ, మహాన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకం, బిల్వార్చన, సహస్రనామార్చన, అమ్మవారి కుంకుమ పూజ, నవవిధ హారతులు, విశేష పుష్పాలంకరణ, శ్రీలక్ష్మి గణపతి రుద్ర నవగ్రహ వాస్తు హోమం, పూర్ణాహుతి తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు జుట్టుకొండ చంద్రయ్య, కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

మట్టపల్లిలో నిత్యకల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి: మట్టపల్లి దేవాలయంలో శుక్రవారం శ్రీరాజ్యలక్ష్మీచెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనృసింహుడి నిత్యకల్యాణాన్ని అర్చకులు వేదమంత్రాల నడుమ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో శ్రీస్వామివారికి విశేష పూజలు, అర్చనలు, అభిషేకాలు, హోమం జరిపారు. శ్రీస్వామి అమ్మవార్ల ఎదుర్కోలు మహోత్సవం అనంతరం కల్యాణతంతు పూర్తిచేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు లక్ష్మణాచార్యులు, పద్మనాభాచార్యులు, ఫణిభూషణ మంగాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఆంజనేయాచార్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

పాస్టర్ ప్రవీణ్ మృతి తీరని లోటు

కోదాడరూరల్ : పాస్టర్ పగడాల ప్రవీణ్ అకాల మరణం క్రైస్తవులకు తీరని లోటని పాస్టర్ సుందర్ రావు అన్నారు. శుక్రవారం కోదాడ పట్టణంలోని కట్టబజార్‌లో గల పీడబ్ల్యూఐ హోరేభూ చర్చిలో పవీణ్ మృతి పట్ల సంతాపం వ్యక్తం చేసి మాట్లాడారు. కార్యక్రమంలో శిల్వే, రాజేష్, ప్రభుదాస్, జోసెఫ్, దేవసహాయం, నెహమ్యా, రాహూల్ ఉన్నారు.



సంతాపం తెలుపుతున్న క్రైస్తవులు

సంక్షిప్త సమాచారం

బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడిగా ఘటోజీ

మోతె : మండలంలోని గోల్‌తండా గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడిగా గుగులోతు ఘటోజిని పార్టీ మండల అధ్యక్షుడు శీలం సైదులు ఆధ్వర్యంలో శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పార్టీ గ్రామ కమిటీ సభ్యులుగా శివాజీ, రవీందర్, పీక మంగు, లకుపతి, మంగిలాల్, లక్ష్మణ్, గ్రామ యూత్ అధ్యక్షుడిగా గుగులోతు సందీప్‌ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు ఏలూరి వెంకటేశ్వరరావు, మండల కార్యదర్శి మద్ది మధుసూదన్‌రెడ్డి, గుగులోతు శంకర్‌నాయక్, గ్రామ శాఖ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు అందజేత

కోదాడరూరల్ : కోదాడ పట్టణ పరిధిలోని తమ్మరలో గల సుందరయ్య కాలనీకి చెందిన అప్పన రామారావు ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై ఇంటి వద్ద చికిత్స పొందుతున్నాడు. శుక్రవారం అతనికి కోదాడ వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు అందజేశారు. వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని పలువురు అన్నారు. ఈ కార్యక్రమంలో వాసవీ క్లబ్ అధ్యక్షుడు సేకు శ్రీనివాసరావు, దాతలు పసుమర్తి చంద్రకాంత్, శ్వేత, మేళ్లచెర్వు కిషోర్, వాసవి, సెక్రటరీ నరేందర్, వెంపటి ప్రసాద్, బెలిదె భరత్, బండారు శ్రీనివాసరావు, గుడుగుంట్ల సాయి, అఖిల్ సాయి తదితరులు ఉన్నారు.

సీఎం సభకు తరలిరావాలి

మోతె : సన్నబియ్యం పథకం ప్రారంభోత్సవంలో భాగంగా హుజూర్‌నగర్‌లో ఈనెల 30న నిర్వహించబోయే సీఎం రేవంత్‌రెడ్డి సభకు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని కాంగ్రెస్ పార్టీ మోతె మండల అధ్యక్షుడు కీసర సంతోష్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ప్రతి గ్రామం నుంచి వంద మందికి తగ్గకుండా పార్టీ కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

దళితబంధు నిధులు విడుదల చేయాలి

నేరేడుచర్ల : హుజూర్‌నగర్‌లో ఈనెల 30వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సన్న బియ్యం పథకాన్ని ప్రారంభిస్తున్నందున అదేరోజు రెండవ విడత దళితబంధు నిధులు కూడా విడుదల చేయాలని బీఆర్ఎస్ పార్టీ పట్టణ మాజీ ప్రధాన కార్యదర్శి ఇంజమూరి రాజేష్ కోరారు. శుక్రవారం నేరేడుచర్లలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దళితులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం దళితబంధు పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేసిందన్నారు. 2022-23 బడ్జెట్‌లో రూ.17,700 కోట్లు కేటాయించి నియోజకవర్గానికి 1100 మందికి చొప్పున దళితబంధు పథకాన్ని పారదర్శకంగా అమలు చేశారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా రెండవ విడత ఇచ్చేందుకు దళితుల తుది జాబితా సిద్ధం చేసినందున దళితబంధు పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు.

30న రామాలయంలో పంచాంగ శ్రవణం

నేరేడుచర్ల : పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం సమీపంలో నూతనంగా నిర్మించిన శ్రీకోదండ రామాలయంలో ఈనెల 30వ తేదీన ఉగాది పర్వదినం సందర్భంగా పంచాంగ శ్రవణం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు శ్రీమొలుగు శ్రీనివాసాచార్యులుచే పంచాంగ శ్రవణం ఉంటుందని, భక్తులు పాల్గొని ఉగాది పచ్చడి, తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.